క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ శిబిరంలో 44 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నాగార్జున

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో 44 మందికి చికిత్స అందజేసినట్టు రాజవొమ్మంగి పీహెచ్‌సీ డాక్టర్ నాగార్జున తెలిపారు. ఆయన రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. బీపీ, సుగర్ సమస్యలున్న వారికి ప్రత్యేక పరీక్షలు చేసిన అనంతరం అవసరమైన మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూత్రాలు తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ రామారావు, హెచ్వీ లక్ష్మి, ఏఎస్ఎం భవాని, 104 డీఈఓ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు నానిబాబు, ఆశ నూకరత్నం పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో నీటి సరఫరా



ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

చింతపల్లిరూరల్: మండల కేంద్రంలో తాగునీటి సమస్య తీర్చేందుకు తమ వంతు కృషిగా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు.బావులు అడుగంటికి పోవడంతో స్థానికంగా నీటి సమస్య అధికంగా ఉందన్నారు. దీంతో ట్యాంకర్ల ద్వారా నీటిని వీధి, వీధుల్లో సరఫరా చేస్తున్నారు.

యూటీఎఫ్ వ్యవస్థాపకుడు దాచూరికి నివాళి



దాచూరి రామిరెడ్డి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ సభ్యులు

గంగవరం: మండల కేంద్రంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్.రాంబాబూ అధ్యక్షతన యూటీఎఫ్ వ్యవస్థాపకుడు దాచూరి రామిరెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాచూరి చేసిన సేవలను పలువురు కొనియాడారు. సభ్యులు సాయిబాబా, విజయలక్ష్మి, రామకృష్ణారెడ్డి. కుసుమ కుమారి, లావణ్య, రాంబాబు పాల్గొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో టెంట్లు



పాడేరు జిల్లా ఆస్పత్రి వద్ద టెంట్లు ఏర్పాటు చేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది

పాడేరు : ఎండల తీవ్రత రోజు,రోజుకు పెరుగుతున్న దృష్ట్యా రద్దీ ప్రదేశాల్లో నీడనిచ్చే టెంట్లను ఏర్పాటు చేస్తున్నట్టు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కో–ఆర్డినేటర్ లోహితాస్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం పాడేరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణలో రోగులు, సందర్శకుల సౌకర్యార్థం నీడనిచ్చే టెంట్లను ఏర్పాటు చేశారు. పాడేరులోని ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో కూడా ఈ ప్రత్యేక టెంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు పల్టాసింగి సూర్యారావు, జయలక్ష్మి పాల్గొన్నారు.

సీపీఎం నేతల ప్రచారం



వనుగుమ్మలో ప్రచారం చేస్తున్న సీపీఎం నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని మారుమూల రంగబయలు, వనుగుమ్మ పంచాయతీల్లో సీపీఎం నేతలు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి అప్పలనర్సయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి గంగాధర్ స్వామిల తరఫున ప్రచారం చేసి కరపత్రాలను పంపిణీ చేశారు. త్రినాథ్, భీమరాజు, రామదాసు పాల్గొన్నారు.



- గ్రామాల్లో శరవేగంగా అభివృద్ధి పనులు
- శివారు ప్రాంతాల్లోనూ తారురోడ్లు
- మెరుగుపడిన రవాణా వ్యవస్థ
- దశాబ్దాల నాటి సమస్యలకు పరిష్కారం
- ఆనందంలో గిరిజనం
- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి **జేజేలు**



కోరాపల్లిలో రైతు భరోసా కేంద్రం



కోరాపల్లిలో గ్రామ సచివాలయం

కోరాపల్లిలో ప్రగతి పరవళ్లు



పెదజాగేరు గ్రామంలో కుళాయి వద్ద నీళ్లు పడుతున్న మహిళలు

జి.మాడుగుల: టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఒక్క గ్రామానికి రోడ్డు, తాగునీటి సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ లేదు. అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం గిరిజన గ్రామాల అభివృద్ధిపై కనీసం దృష్టి సారించలేదు. దశాబ్దాలుగా గిరిజనులు అన్ని సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా చంద్రబాబు తన హయాంలో పట్టించుకోలేదు. గిరిజనులను పూర్తిగా విస్మరించారు. ప్రభుత్వ పరంగా ప్రజలకు **సేవలందక ఇబ్బందులు పడేవారు. ప్రతీ పనులు జన్మభూమి కమిటీల సారథ్యంలో జరిగేవి. కమిటీలు ఇష్టారాజ్యంగా** వ్యవహరించేవారు. ప్రతి పనికి దోచుకొని పంచుకునే వారు...మన్యంలో ఒక్క అభివృద్ధి పని చేసిన దాఖలాలు లేవు.అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఏజెన్సీ ప్రాంతాభివృద్ధికి కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆదివాసీ గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయి. నాడు–నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారాయి. శివారు గ్రామాలకు రహదారుల నిర్మాణం జరిగింది. కోట్లాది రూపాయలతో తాగునీటి పనులు జరిగాయి. ఇంటింటికీ కుళాయి ఏర్పాటుతో దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. సెల్ టవర్లు ఏర్పాటుతో శివారు ప్రాంతాల్లోనూ సాంకేతిక సమస్య పరిష్కారమైంది. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయటం, ప్రభుత్వ సేవలు అందుబాటులోనికి తెచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వ్యవస్థతో గిరిజన గ్రామాల్లో ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా, అవినీతి రహిత పాలన సాగించి చెంతకే సంక్షేమ అభివృద్ధి పథకాలు, ప్రభుత్వ సేవలు చేర్చడంతో గిరిజనులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా రుణపడి ఉంటామని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే పూర్తి మద్దతు ఉంటుందని బాహాటంగానే ప్రకటిస్తున్నారు.

కోరాపల్లి గ్రామ సచివాలయం పరిధిలో 22 గ్రామాలు ఉండగా, 3,115జనాభా ఉన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఆయా గ్రామాలు కనీస అభివృద్ధి జాడ లేకుండా పోయింది. గిరిజన గ్రామాల్లో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే సమస్యలు పరష్కారమయ్యాయి. సచివాలయం ద్వారా అందరికీ ప్రభుత్వ సేవలు అందుతున్నాయి.

కోరాపల్లి సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధి

పథకం	లబ్ధిదారులు	జమఅయిన నగదు
జగనన్న అమ్మఒడి	341	రూ.1,51,73,500
వైఎస్సార్ రైతు భరోసా	657	రూ.2,79,94,250
పెన్షన్ కానుక	396	రూ.3,90,28,500
జగనన్న విద్యాదీవెన	99	రూ.10,71,985
వైఎస్సార్ ఆసరా	70	రూ.5,05,374
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	34	రూ.6,79,404
వైఎస్సార్ బీమా	12	రూ.22,00,000
వైఎస్సార్ చేయూత	133	రూ.55,68,750



కొక్కిరాపల్లి–తగ్గిమెట్ట వరకు రోడ్డు



వంట్లమామిడిలో ప్రభుత్వ పాఠశాల

కోరాపల్లి సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు

- రూ.40లక్షలతో గ్రామ సచివాలయం భవనం
- రూ.21.80లక్షలతో కోరాపల్లిలో రైతు భరోసా కేంద్రం నిర్మాణం.
- కొక్కిరాపల్లి–వంట్లమామిడి, రేగడి వరకు 3కిలోమీటర్లు గ్రావెల్ రోడ్డు
- పెదజాగేరిలో రూ.3లక్షలతో గ్రావిటీ పథకం
- గున్నమామిడి, గనెల్బ, తగ్గిమెట్ట, వంట్లమామిడి, వయ్యంపల్లి, సుర్తిపల్లి గ్రామాల్లో రూ.30లక్షలతో రక్షిత తాగునీటి పథకాలు
- గున్నమామిడి, గనెల్బ, తగ్గిమెట్ట, కిటుముల గ్రామాల్లో రూ.6లక్షలతో బోర్లు నిర్మాణంతో కుళాయిల ఏర్పాటు.
- కోరాపల్లి–పెడకొండ వరకు ఒక కోటి రూపాయలతో 3కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం.
- పాలకొండ–రూడిబయలు వరకు 3కిలోమీటర్లు రూ.60లక్షలతో రోడ్డు
- రూ.30లక్షలతో గనెల్బ–అనర్బ వరకు 2 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు నిర్మాణం.
- రూ.30లక్షలతో సంగులోయ–బొడ్డాపుట్టు రోడ్డు నిర్మాణం.
- కోరాపల్లి– తగ్గిమెట్ట కిలో మీటరు రూ. 20లక్షలతో బిటీ రోడ్డు నిర్మాణం.
- నాడు–నేడు కింద రూ.30లక్షలతో వంట్లమామిడి పాఠశాలలో అభివృద్ధి పనులు.

జగనన్నకు రుణపడి ఉంటాం



గతంలో తాగునీటి కోసం చాలా దూరంలో ఉన్న కొండగెడ్డ, ఊటగెడ్డలను ఆశ్రయించి కలుషితమైన, బురద నీటిని మోత బరువుతో తెచ్చుకొని మంచినీటి అవసరాలు తీర్చుకొనేవారం. దీంతో తరచూ రోగాలు బారిన పడి ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చేవి. వైస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మా గ్రామానికి తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఇంటింటికి కుళాయి ద్వారా తాగునీటి కల్పించారు. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాం. **–వనగల బంగారమ్మ**, గిరిజన మహిళ, పెదజాగేరి గ్రామం

రోడ్డు సమస్య తీరింది



రూడిబయలు గ్రామానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు కల్పించాలని చాలాసార్లు వినతులు ఇచ్చాం. వర్షాకాలంలో నడవటానికి ఇబ్బందులు పడేవారం అత్యవసర సర్వీసులకు రోడ్డులేక వచ్చేవికావు, దీంతో గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే గ్రామానికి రోడ్డు రవాణా సదుపాయాలు మెరుగుపడ్డాయి.రోడ్డు సమస్య తీరింది. రవాణా మెరుగుపడింది. **–దూరు రాజారావు**, రూడిబయలు గ్రామం

శరవేగంగా అభివృద్ధి



గ్రామ సచివాలయం పరిధిలో గల గ్రామాల్లో ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాం, అన్ని గ్రామాల్లో తాగునీటి పథకాలు ఏర్పాటు చేశాం. నాడు–నేడు కింద పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాం. అవినీతిరహిత పాలన సాగిస్తున్నాం. గ్రామాల్లో రోడ్లు నిర్మాణాలు చేపట్టాం. గిరిజన గ్రామాలను శరవేగంగా అభివృద్ధి జరిగింది. **–మసాడి రాజులమ్మ**, సర్పంచ్, కోరాపల్లి, జి.మాడుగుల మండలం

జగనన్నను మళ్లీ సీఎంగా ఆశీర్వదించండి



డి.గొందూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

- హోరెత్తిన ప్రచారం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు గ్రామ, గ్రామాన విశేష ఆదరణ
- జగనన్నకే మద్దతు అంటూ గిరిజనుల జేజేలు

పాడేరు: వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం ఆ పార్టీ శ్రేణులు చేపడుతున్న ఎన్నికల ప్రచారానికి అడుగడుగునా, గ్రామ,గ్రామానా గిరిజనుల నుంచి ఘన స్వాగతం, ఆదరణ లభిస్తోంది. పార్టీ శ్రేణులు గ్రామాల్లో పర్యటించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలను అవగాహన కలిగిస్తూ ఈ ప్రచారం చేస్తున్నారు. ప్రతి గ్రామంలో కూడ గిరిజనులు, స్థానికులు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. కుల,మత, ప్రాంత, పార్టీ, వర్గ బేధాలకు తావులేకుండా అన్ని వర్గాలకు సీఎం జగన్‌రెడ్డి సంక్షేమం అందించారని, ఎన్నడూ లేనంత అభివృద్ధి జరిగిందని గ్రామస్తులకు వివరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వివరించారు. మరిన్ని సంక్షేమ పథకాలు, మరింత అభివృద్ధి, ఆర్థిక సాధికారత పొందేందుకు జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

- పాడేరు మండలంలోని లగిసపల్లి, వంజంగి, డి.గొందూరు పంచాయతీల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ పంచాయతీరాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

జి.మాడుగుల/గూడెం కొత్తవీధి: జి.మాడుగుల మండలంలోని కుంబిడిసింగి, గెడ్డరాయి, వెన్నెల, చింతగొంది, ఉర్లమెట్ట, అడ్డంగిసింగి, నేరేడివలస తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు,జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ కె సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండం నాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్. రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, సీదరి కొండబాబు, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగూర్‌బాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ నంబర్ అంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. గూడెం కొత్తవీధి మండలంలోని వంచుల పంచాయతీలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ పనసర కాసులమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు

జగనన్న పాలనలోనే గిరిజన ప్రాంతాలభివృద్ధి

హుకుంపేట/ముంచంగిపుట్టు/పెదబయలు: హుకుంపేట మండలంలోని సూకురు, భీమవరం, బాకురు, వై.బాకురు, గొప్పులపాలెం గ్రామాల్లో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో గిరిజన ప్రాంతాల్లో ఎన్నడూ ఊహించని అభివృద్ధి జరిగిందన్నారు. గిరిజనుల ఆర్థిక స్థితిగతులు మారాయన్నారు. పేదల అభ్యున్నతి జరిగిందన్నారు. గ్రామస్తులందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మురళి, బాలన్న, లంబన్న, పద్మారావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు. ముంచంగిపుట్టు మండలంలో దారెల, పెదగూడ పంచాయతీల్లోని గ్రామాల్లో సర్పంచ్ మండి బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు గణపతి తదితరులు పాల్గొన్నారు. పెదబయలు మండలంలోని రూడకోట, కొరవంగి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో మండల పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ సన్యాసి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్, సర్పంచ్ పోయిభ బాలయ్య దొర, ఎంపీటీసీ సభ్యుడు పూర్ణారావు తదితరులు పాల్గొన్నారు.



దారెలలో ప్రచారంలో పాల్గొన్న నాయకులు



అండంగిసింగిలో ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ వెంకటలక్ష్మి

సీఎం జగనన్నతోనే పేదల అభ్యున్నతి

చింతూరు/గంగవరం/ఎటపాక/వీఆర్ పురం/కూనవరం: మండలంలోని లచ్చిగూడెం, చదలవాడ, మిట్టవాడ, మామిళ్లగూడెం తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ చిచ్చడి మురళి, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, ఎంపీపీ సవలం అమల, మాట్లాడుతూ సీఎం జగనన్నతోనే పేదల అభ్యున్నతి సాధ్యమైందని, గడప గడపకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మిని గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ కోట్ల కృష్ణ, యూత్ కన్వీనర్ రాజు, మైనార్టీ సెల్ కన్వీనర్ ఎండీ జిక్రియా, సర్పంచ్‌లు కారం కన్నారావు, ముచ్చిక నాగార్జున, కుంజా తిరపతిరావు, విప్లవ్‌కుమార్, సీతారామయ్య, సాయి, లచ్చుదొర, జయరాజు తదితరులు పాల్గొన్నారు. గంగవరం మండలంలోని సూరంపాలెం, వేమనపల్లి, రాజుపేటలొద్ది, దోనెలపల్లి రాజవరం గ్రామాల్లోని ఎన్నికల ప్రచారాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు బేబీ రత్నం, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , పార్టీ మండల కన్వీనర్ అప్పలరాజు, వైస్ ఎంపీపీ కే గంగాదేవి, పద్మావతి , సొసైటీ డైరెక్టర్ పండా సిద్దార్థ, సర్పంచులు లీలావతి, శివ, కామరాజు , రమణమ్మ పార్వతి, రామలక్ష్మి, లక్ష్మి, ఏడుకొండలు, మాడెం కుమార్, కన్వీనర్ శ్రీను, పార్టీ మండల ఇన్‌చార్జి రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు. ఎటపాక మండలంలో నల్లకుంట,గన్నవరం,కన్నాయిగూడెం తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీపీ కాక కామేశ్వరి, కన్వీనర్లు ప్రశాంత్, వాసు, సొసైటి చైర్మన్ లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు వెంకటరామారావు, జిల్లా కార్యదర్శి రేవతి తదితరులు పాల్గొన్నారు. వీఆర్ పురం మండలంలోని పెదమట్టపల్లి ,రామవరం,సీతంపేట తదితర గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచారాల్లో వైస్ ఎంపీపీ ముత్యాల గంగాభవాని, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొడ్డు సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానీటరింగ్ కమిటీ సభ్యుడు చిక్కాల బాలు, నాయకుడు గంగులు తదితరులు పాల్గొన్నారు. కూనవరం మండలంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మేరుకులం రాష్ట్ర డైరెక్టర్ దీకొండ గంగాధర్, పార్టీ మండల కార్యదర్శి భరతమూర్తి, టౌన్ ప్రెసిడెంట్ కొమ్మాని మోహన్ రావు, మైనార్టీ సెల్ కార్యదర్శి మున్నాఫ్ తదితరులు పాల్గొన్నారు.



పెదమట్టపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



బాకురులో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



కొరవంగిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు



చింమామిళ్లగూడెంలో ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ మురళి, వైస్ ఎంపీపీ సుధాకర్



సూరంపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న నేతలు



గన్నవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల కన్వీనర్ వాసు



సీతంపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైస్ ఎంపీపీ గంగాభవానీ, నాయకులు



కూనవరంలో ప్రచారం నిర్వహిస్తున్న కార్యకర్తలు

నేడు ధనలక్ష్మి ఎన్నికల ప్రచారం

గంగవరం : మండలంలోని అముదాలబండ, దొరమామిడి, గురగోమ్మి, పెద్దగార్లపాడు తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికలప్రచారం నిర్వహిస్తున్నట్టు పార్టీ నాయకుడు తోట రాజేశ్వరరావు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ రోడ్‌షో

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము నుంచి రాజవొమ్మంగి వరకు శనివారం సాయంత్రం 4 గంటలకు బైక్‌లతో భారీ రోడ్ షో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం రాజవొమ్మంగి గాంధీ బొమ్మ సెంటర్లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో రంపచోడవరం సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థిని, నాగులపల్లి ధనలక్ష్మి, ఎంపీ అభ్యర్థిని తనూజరాణిలతో పాటు ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌లు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం సూరంపాలెం, ఒట్టిగెడ్డ, జడ్డంగి, చెరకుంపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ



వాల్మికీనగర్‌లో ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్‌వోలు

రాజవొమ్మంగి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అధికారులు అన్ని విధాలు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా మండల వ్యాప్తంగా గల 52 పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు ఓటింగ్ స్లిప్పులను బీఎల్‌వోలు చురుగ్గా పంపిణీ చేస్తున్నారు.ఇప్పటి వరకు 30 శాతం ఓటింగ్ స్లిప్పుల పంపిణీ జరిగిందని, త్వరితగతిన పూర్తి చేస్తామని తహసీల్దార్ సత్యనారాయణ చెప్పారు. ఓటర్లకు ఇస్తున్న ఓటరు స్లిప్పులు గుర్తింపు కార్డులు కాదని ఈ విషయాన్ని ఓటరు గుర్తించాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే వారు ఓటరు స్లిప్పుతో పాటు, ఆధార్‌కార్డు, ఓటరు ఐడెంటిటి కార్డు వంటి గుర్తింపుకార్డును తమ వెంట తీసుకొని రావాలని సూచించారు.

ఓటరు స్లిప్పులు అందేలా చూడాలి

చింతపల్లిరూరల్: మండలంలోని బీఎల్‌వోలతో తహసీల్దార్ టి.రామకృష్ణ శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని ఓటరు స్లిప్పులను బీఎల్‌వోల ద్వారా పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. మండలంలోని పోలింగ్ కేంద్రాలను బీఎల్‌వోలు పరిశీలించి, అక్కడి సదుపాయాలపై నివేదిక ఇవ్వాలన్నారు.ప్రతి ఓటరుకి ఓటరు స్లిప్పుల పంపిణీలో బీఎల్‌వోలు సహకరించాలని కోరారు. ఎంపీడీవో వీరసాయిబాబు పాల్గొన్నారు.